క్లుప్తంగా

ట్రైసైకిళ్ల పంపిణీ



ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు అందజేస్తున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: స్థానిక భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర శిక్ష అందజేసిన ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలను ఎంఈఓ తిరుమలప్రసాద్ గురువారం పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం భవితా కేంద్రాల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఎస్కార్ట్ రవాణా చార్జీలు,రీడర్ అలవెన్సులు,బాలికలకు స్టైఫండ్,ఉచిత ఉపకర ణాలు, ఫిజియోథెరపీ సేవలు, పెన్షన్ అందజేస్తోందన్నారు. ఐఈఆర్పీలు చింతల రాజేశ్వరి,గండి తేజస్విని,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించాలి



అధ్యాపకులతో సమావేశమైన డీఐఈఓ తవిటినాయుడు

వంగర: విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించాలని, ఇంటర్మీడియట్ విద్యలో నూతన బోధన పద్ధతులు అవలంబించాలని డీఐఈఓ శివ్వాల తవిటినాయుడు అధ్యాపకులకు సూచించారు. మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు.అధ్యాపకులు, విద్యార్థుల హాజరు, ఇతర రికార్డులతో పాటు మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విద్యార్థు ల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు.ప్రతీ శనివారం విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ కోట రవిశంకర్ ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయంలో వివిధ విభాగాల్లో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఉద్యోగులను గ్రామ సర్పంచ్ బొద్దల పద్మ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు,అధికారులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ పి.రవికుమార్ మాట్లాడుతూ ఏ ఉద్యోగికైనా వారు అందించిన సేవలే గుర్తింపు తెస్తాయని అన్నారుఇక్కడ ఎలా అయితే అందరి మన్ననలు పొందేలా పని చేశారో బదిలీపై వెళుతున్న చోట కూడా ఇలాగా పని చేయాలని సూచించారు. స్థానిక నాయకుడు బొద్దల సత్యనారా యణ, డిప్యూటీ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, తదితరలు పాల్గొన్నారు.

భీమవరంలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న జెమ్స్ వైద్యులు

బాడంగి: మండలంలోని భీమవరంలో సర్పంచ్ చప్ప తిరుపతినాయుడు ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి గ్రామంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన 276 మందికి శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి చెందిన వివిధ విభాగాల వైద్యులు ఎల్.కె.విజయ్‌కుమార్, విక్రమ్, ప్రసన్నపోయచ్ వైద్య పరీక్షలు చేశారు. 37మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు జెమ్స్ పీఆర్‌ఓలు శ్రీరామ్,శంకర్ చెప్పారు. శిబిరం మేనేజర్ ఎం.సింహాచలం, ఏరియా మేనేజర్ అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో గాయత్రీదేవి



గాయత్రీమాత

రాజాం: పట్టణంలోని గాయత్రీకాలనీలో గాయత్రీదేవి ఆలయం శ్రావణ శుక్రవారం పూజలకు ముస్తాబైంది. గాయత్రీదేవిని అర్చకులు వాన జగదీశ్వరరావుశర్మ పలు రకాల గాజులతో గురువారం అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

మొక్కజొన్నపై మక్కువ

- ఖరీఫ్‌లో పెరిగిన సాగు విస్తీర్ణం
- పెట్టుబడి తక్కువ కావడంతో ఆసక్తి
- తక్కువ నీటితడులతో చేతికందుతున్న పంట



రాజాం మండలం పాగిరి సమీపంలో సాగులో ఉన్న మొక్కజొన్న

రాజాం: మొక్కజొన్న పంటపై రైతులకు ఆసక్తి పెరిగింది. రాజాం నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ఖరీఫ్‌లో వరి సాగుచేస్తుంటారు. గతేడాది వరకు ఇలానే కొనసాగింది. కానీ ఈఏడాది వాతావరణం ప్రతికూలంగా మారడంతో పాటు మొక్కజొన్న పప్పుకు డిమాండ్ కూడా ఉండడంతో రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఇదివరకే కొంతమంది రైతులు పంటను ప్రారంభించగా, మరికొంతమంది ఇప్పుడిప్పుడే విత్తనాలు వేస్తున్నారు.

నియోజకవర్గంలో 19 వేల ఎకరాల్లో..

గతేడాది వరకు నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 12 నుంచి 16 వేల ఎకరాల మధ్య మొక్కజొన్న పంట సాగులో ఉండేది. ఈఏడాది రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో ఈ పంట సాగు విస్తీర్ణం 19 వేల ఎకరాలకు పెరిగింది. 2024–25 రబీ సీజన్‌లో ఈ పంట సాగు తగ్గుముఖం పట్టగా, తాజాగా ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం అనూహ్యం గా పెరిగింది. సాగునీటి వనరులు అరకొరగా ఉన్న ప్రాంతాలు, మెట్టు భూములు ఈ పంటకు అనుకూలంగా ఉంటు న్నాయి. వరుణుడు కరు ణించకపోవడం, కాలువల ద్వారా సాగునీరు సరఫరా కాకపోవడంతో వరి ఉబాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. ఫలితంగా గతేడాది వరి పంట సాగుచేసిన ప్రాంతాలతో పాటు ప్రస్తుతం వరి వెద పంట వేసిన ప్రాంతాల్లో కూడా ఆ పంటను దున్నేసి, మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మొక్కజొన్న సాగు గతేడాది కంటే ప్రస్తుతం పెరిగింది.

రాజాం నియోజకవర్గంలో మొక్క జొన్న సాగు వివరాలు ఇలా

మండలం	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
రాజాం	5,200
సంతకవిటి	6,100
రేగిడి	4,900
వంగర	2,800

ప్రతికూలం నుంచి అనుకూలం

ఈఏడాది ఖరీఫ్ సాగు ఆరంభంలో వర్షాలు మొక్కజొన్న పంటను అతలాకుతలం చేశాయి. తొలకరి జల్లులు ముందుగా రావడంతో మొలక దశలో పంట చితికిపోయి, పెరుగుదల మందగించింది. అనంతరం వర్షాలు తగ్గుముఖం పట్టడం పంటకు అనుకూలంగా మారింది. ఇదే అదునుగా రైతులు మొక్కజొన్న పిక్కలు పొలాల్లో వేశారు. ప్రస్తుతం పంట పలుచోట్ల పూతదశలో ఉండగా, మరికొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే మొలకలు ప్రారంభమయ్యాయి.

వరి కంటే పెట్టుబడి తక్కువ

మొక్కజొన్నకు వరి పంటకంటే పెట్టుబడి తక్కువగా ఉంటుంది. ఎకరా వరి సాగుకు రూ. 20 వేలు దాటి ఖర్చు పెట్టాల్సి వస్తుంది. అదే స్థానంలో మొక్కజొన్న వేస్తే ఎకరాకు రూ. 16 వేలు సరిపోతుంది. ఎకరానికి 8 కిలోల మొక్కజొన్న గింజలు విత్తాల్సి ఉంటుంది. వాతావరణం అనుకూలంగా ఉంటే ఎకరానికి 23 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రబీలో ఈ దిగుబడి ఇంకా ఎక్కువగా ఉంటుంది. క్వింటాల్ పప్పు ధర రూ. 2,400 ఉండగా, రైతుకు ఖర్చులు పోనూ రూ. 30 వేల వరకు ఆదాయం వస్తుంది. మూడు నెలల్లో ఈ పంట చేతికందుతుంది.

సాగు విస్తీర్ణం పెరిగింది



రాజాం మండలంలో రైతులు ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో మొక్కజొన్న సాగుచేస్తుంటారు. గతేడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం 5200 ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగుచేస్తున్నారు. పంట పలుచోట్ల ఆరంభం దశ, మరికొన్నిచోట్ల మధ్యస్త దశలో ఉంది.

– సీహెచ్. రఘునాథ్, ఏఓ, రాజాం.

రెండకరాల్లో సాగు చేస్తున్నా..



ప్రస్తుతం మొక్కజొన్న గింజలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. రబీలో ఈ పంట సాగుచేసేందుకు సాగునీటి ఇబ్బందులు ఉండడంతో వెనుకడుగువేశావ. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తున్నాం.

– చౌదరి సింహాచలం, రైతు, గడిముడిదాం, రాజాం మండలం.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు ఆనందరావు, తదితరులు

తెర్లాం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు అలమండ ఆనందరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెకీతో చేసుకున్న ఒప్పందాల కారణంగా ప్రజలపై తీవ్ర భారం పడుతుందన్నారు. ఈ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, అలాగే స్మార్ట్ మీటర్లను రద్దు చేసి పాత మీటర్లనే కొనసాగించాలని కోరారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది ఎక్కడైనా స్మార్ట్ మీటర్లను అమర్చితే వాటిని పగలగొట్టండని పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత బలవంతంగా వాటిని అమర్చుతున్నారని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం ప్రజలు, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రజావ్యతిరేక కార్యకలాపాలను విరమించుకోవాలని, లేదంటే భవిష్యత్‌లో ప్రజాఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సీపీఐ మండల నాయకులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

రాజాం సిటీ: స్థానిక అర్బన్ పీహెచ్‌సీలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 13 మంది గర్భిణులకు గురువారం సీమంతాలు చేసి, పౌష్టికాహారం అందజేశారు. అలాగే అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మాతాశిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టి పాపారావు, సప్పటి వసంతరావు, సభ్యులు మక్క అప్పలనాయుడు, కొల్లా కృష్ణారావు, ఆకిరి రామారావు, జయదేవ్, సురేష్, శ్రీనివాసరావు, తిరుమలరావు, ఎల్‌టీ సింహాచలం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేసి పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మర్యాదపూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న బ్రాహ్మణకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు ఆఫీస్‌లో మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను జగన్‌మోహన్‌రెడ్డికి వివరించానని రాయులు తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్న బాగున్నారా అని జగన్‌మోహన్‌రెడ్డి అడగడంతో పాటు భవిష్యత్‌లో మనకు మంచి రోజులు రానున్నయని,పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని సూచించారని రాయులు చెప్పారు.

సంక్షిప్తంగా...

బ్రహ్మకుమారీస్ రాఖీ ఆవిష్కరణ



రాఖీని ఆవిష్కరిస్తున్న యోగా గురువు ప్రసాద్, బ్రహ్మకుమారీలు

బొబ్బిలి: పట్టణంలోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ముఖ్యకేంద్రమైన మౌంట్ అబూ నుంచి వచ్చిన పవిత్ర రాఖీని పట్టణానికి చెందిన యోగా గురువు ప్రసాద్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. స్థానిక బ్రహ్మకుమారీస్ బ్రాంచ్ ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి నేపథ్యంలో ఈనెల 9 వరకు చుట్టుపక్క అయిదు మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. పిరమిడ్ యోగా గురువు చంద్రమౌళి, 40 మంది యోగా సాధకులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపడుతున్న ప్రజావేదిక సభ్యులు

బొబ్బిలి: విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే రద్దు చేయాలంటూ ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, తదితరులు గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి వినియోగదారుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ప్రతి నెలా అదనపు సర్దుబాటు చార్జీల బాదుడు పెరుగుతునే ఉందన్నారు. దీనిని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 5న బొబ్బిలి ఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాలో విద్యుత్ వినియోగదారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

తెర్లాం: మండలంలోని నందిగాం విద్యుత్ ఫీడర్ పరిధిలో ఇటీవల వీచిన గాలులకు విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు ఏఈ తెంటు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ..వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో యుద్ధప్రాతిపదికన కొత్త స్తంభాలు వేసినట్లు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



ఎస్సీ,ఎస్టీల హక్కులను వివరిస్తున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలిరూరల్: ఎస్సీ,ఎస్టీ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తహసీల్దార్ ఎం.శ్రీను హామీ ఇచ్చారు.మండలంలోని కింతలివానిపేటలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా మండల అధికారులు గ్రామంలో పర్యటించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు, కల్పించాల్సిన మౌలిక సదుపాయాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఎస్సీ,ఎస్టీల హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ శాంతిబద్రతల అంశంలో రాజీలేదని, ఏ అంశమైనా నిర్భయంగా వెల్లడించాలని అన్నారు.అంటరాని తనం,గ్రామబహిష్కరణలు తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ పి.రవికుమార్,ఆర్ఐ రామకుమార్ పాల్గొన్నారు.

గొడవలు తగదు..

రాజాం సిటీ: ప్రతి చిన్న విషయానికీ గొడవలు పడవద్దని టౌన్ సీఐ కె. అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని గురవాం గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని సూచించారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి పోవద్దన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

సందర్శన

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని లచ్చారాయపురం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి



బూరాడ సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ కృష్ణలత

రేగిడి: ప్రజా సమస్యల పరిష్కారంపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ కృష్ణలత సూచించారు. బూరాడ గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్లాస్టిక్‌వద్దు..గుడ్డసంచులే ముద్దు



రాజాం పట్టణంలోని అమ్మవారికాలనీ, ఆదర్శనగర్, నవ్యనగర్‌లలో వికాసతరంగిణి సభ్యులు గురువారం ఇంటింటికీ గుడ్డసంచులు పంపిణీ చేశారు. వికాసతరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి టి.టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరై గుడ్డసంచులనే వినియోగించాలని సూచించారు. అనంతరం ప్లాస్టిక్ వద్దు.. గుడ్డసంచు లే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. వికాసతరంగిణి రాజాం శాఖ అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, సభ్యులు పి.చైతన్యకుమార్, ఎ.వెంకటినాయుడు, గడే అప్పలనాయుడు, ఇ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– రాజాం సిటీ

నెర్రెలు వారుతున్న వరి పొలాలు



భీమవరంలో..

తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా బాడంగి మండలంలో వరి నాట్లు వేసిన పొలాలతో పాటు నారు మడులు నెర్రెలు వారుతున్నాయి. వరుణుడు ముఖం చాటేయడంతో పాటు గత కొద్దిరోజులుగా వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడంతో వరి పైరు, నారు ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్న చోట మాత్రమే వరి నాట్లు పడ్డాయి. చెరువుల్లో నీరు లేకపోవడంతో వాటి కింద ఆయకట్టు ప్రాంతాల్లో ఇంకా దమ్ములు జరగలేదు. పలువురు చిన్నసన్న కారు రైతులు వారి పొలాల పక్కనే ఉన్న పెద్ద రైతులకు చెందిన బోర్లు ఆధారంగా నాట్లు వేసినప్పటికీ నీటి తడులు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బోరుబావులున్న రైతులకే వాటి నీరు సరిపోకపోవడంతో, చిన్న,సన్నకారు రైతులు తమ పొలాలకు నీరందించే అవకాశం లేక ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. మరో వారం పదిరోజుల్లో వర్షాలు కురిస్తేనే పూర్తిస్థా యిలో నాట్లు పడతాయని, ఇదివరకు వేసిన నాట్లు బతుకుతాయని...లేకుంటే ఖరీఫ్ వరిపై ఆశవదులుకోవాల్సిందేనని రైతులు అంటున్నారు.– బాడంగి

కూటమి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో డాక్టర్ తలే రాజేష్



రాజాం: సారధి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను వివరిస్తున్న రాజేష్, తదితరులు

రాజాం: కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకూ అన్యాయం చేస్తోందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. రాజాం మున్సిపాల్టీ పరిధిలోని సారధి గ్రామంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు.రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ముందు ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలను గుర్తుచేశారు. కూటమి నేతలు గ్రామాల్లో ఇళ్లకు వచ్చేటప్పుడు ఎన్నిక హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని నిలదీయాలని ప్రజలకు సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలుచేయలేక చతికిలపడిందని అన్నారు.వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని దుయ్యబట్టారు.వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పెన్షనర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పాలవలస శ్యామ్, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగేంద్ర, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, నాయకులు దూబ గోపాలరావు, కిల్లారి శ్రీనివాసరావు, వావిలపల్లి హరి, కోరాడ రామినాయుడు, మిత్తిరెడ్డి నారాయణరావు, మజ్జి రమణ, అల్లాడ శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.



రాజాం సిటీ: నందబలగలో చంద్రబాబు మోసాలపై వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నమ్మినవారిని నట్టేటముంచడంలో దిట్ట

రాజాం సిటీ: తనను నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిట్టని వైఎస్సార్‌సీపీ రాజాం మండలం రూరల్ కన్వీనర్ లావేటి రాగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు ఆరోపించారు. మండలంలోని కొతారిపురం, నందబలగ గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు.హామీల అమలులో చంద్రబాబు వైఫల్యాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముళ్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, మాజీ సర్పంచ్‌లు బింగి సూర్యనారాయణ, ముడిల జనార్దనరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు

రేగిడి: వర్షాకాలం నేపథ్యంలో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు జాగ్రత్తలు సూచించాలని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు సూచించారు. బూరాడ పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బందితో గురువారం ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అవసరమైన మందులు తెప్పించుకుని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. పాముకాటు, కుక్క కాటు వ్యాక్సిన్‌ల నిల్వలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని వైద్యాధికారి చలంకు సూచించారు. వైస్ ఎంపీపీ–2 వావిలపల్లి జగన్‌మోహనరావు, సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు, ఈఓ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

బొబ్బిలి: మాదకద్రవ్యాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని సీఐ కె. సతీష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని గొల్లపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్ప రథం నుంచి షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



బొబ్బిలిరూరల్: ఉద్యోగ విరమణ చేసిన ఎంఈఓ లక్ష్మణరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయసంఘాల ప్రతినిధులు

బొబ్బిలిరూరల్: మండల విద్యాశాఖాధికారిగా(ఎంఈఓగా) సుదీర్ఘకాలం ఇక్కడ పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన చల్లా లక్ష్మణరావును స్థానిక ఎమ్మార్సీలో ఉపాధ్యాయ సంఘాలు గురువారం సన్మానించాయి. ఆయన సేవలను ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కొనియాడారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె.సి.రాజు మాట్లాడుతూ ఉన్నత విలువలు, నిబద్ధతతో విధులు నిర్వర్తించే వారికి ప్రజల్లో, సంబంధిత శాఖల్లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు, సభ్యులు ఎస్.చిట్టిబాబు తదితరులు ఎంఈఓ లక్ష్మణరావును సత్కరించారు.

మజ్దూర్ ప్రకాశరావుకు సత్కారం



బొబ్బిలి: ఇరిగేషన్ మజ్దూర్ ప్రకాశరావు,పద్మ దంపతులను సత్కరిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

బొబ్బిలి: ఇరిగేషన్ శాఖలోని బొబ్బిలి సెక్షన్ –1లో మజ్దూర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పడాల ప్రకాశరావును స్థానిక సెక్షన్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీ నాయన, ఇరిగేషన్ డీఈఈ నారాయణరావు, తిరుమలరావు, ఏఈ శంబంగి సుధీర్ పాల్గొన్నారు.